నేడు జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి రాక

నిజామాబాద్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించనున్నారు. సాయంత్రం 4గంటలకు వినాయకనగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద రోడ్డు పనులను ప్రారంభించనున్నారు.



వంట సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఆహారం కలుషితం కాకుండా చూడాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

డిచ్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూరగాయలను, ఆహార పదార్థలను స్టీల్ డబ్బాలలో భద్రపరిచి మూతలు ఉంచాలని, ఏ దశలోనూ ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో గల జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. స్టోర్ రూం, వంట గదులను పరిశీలించి, మధ్యాహ్నం భోజనం పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆహార పదార్థాలను శుభ్రమైన వాతావరణంలో భద్రపర్చాలన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం వండే ముందే పదార్థాలను సరిచూసుకోవాలని, కాలం చెల్లిన పదార్థాలను వినియోగించవద్దని సూచించారు. నాసిరకం వస్తువులు సరఫరా జరిగితే తహసీల్దార్‌కు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట స్థానిక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సకాలంలో ధాన్యం డబ్బులు చెల్లించాలి : కలెక్టర్

డిచ్‌పల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. గురువారం మండలంలోని రాంపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. మిల్లులకు ధాన్యం తరలించినప్పటికి ట్రక్ సీట్‌లను తెప్పించుకోవడంలో ట్యాబ్ ఎంట్రీలలో జాప్యం జరుగుతుందని, సంబంధించి కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి ధాన్యం కొన్న 48గంటల్లో బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్న ఎందుకు అలసత్వ వైఖరి ప్రదర్శిస్తున్నరని నిలదీశారు. రైతులు బిల్లుల కోసం నిరీక్షించే సమస్య రాకుండా సత్వరమే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా పర్యవేక్షణ చేయాలని స్థానిక తహసీల్దార్ ప్రభాకర్‌కు బాధ్యతలు పురమాయించారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలను ఆరా తీసిన కలెక్టర్ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు తరలించిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లో మిల్లుల్లో కోతలు విధించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ దశలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వారు నష్టపోకుండా సంబంధిత అధికారులు, నిర్వాహకులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం విక్రయించిన వెంటనే బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు.



రైస్‌మిల్లుల్లో తనిఖీలు

- జిల్లాలోని 30 రైస్‌మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు
- వేలం వేసిన ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న బృందాలు
- పౌరసరఫరాల సంస్థ ఎండీకి ఇవ్వనున్న నివేదిక
- ఆయన ఆదేశాలకు అనుగుణంగా చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు

నిజామాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని రైస్‌మిల్లుల మొండి బకాయిలను వసూలు చేసేందుకు రెండు రోజులుగా మిల్లులను తనిఖీలను చేస్తున్నారు. వేలంలో ధాన్యం నిల్వలను ఇవ్వని మిల్లులపై చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలోని 30మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించడంతో పాటు వేలం ధాన్యం ఉందో వివరాలను సేకరిస్తున్నారు. ధాన్యం నిల్వలు లేని మిల్లులపై చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. వారి నుంచి ధాన్యం కేటాయింపులకు సరఫరా డబ్బులను ముక్కుపిండి వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని పౌరసరఫరాల అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు. వారం రోజుల్లోపు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో పాటు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లు

జిల్లాలో 2022-23 సంవత్సరం యాసంగిలో మిల్లులకు ధాన్యం కేటాయించారు. ఈ ధాన్యం నిల్వలకు అనుగుణంగా సీఎంఆర్ కింద బియ్యాన్ని అందించాలని ఆదేశాలు ఇచ్చారు. మిల్లుల్లో నిల్వలు లేకపోవడం, కొన్ని మిల్లులు వందల కోట్ల రూపాయల ధాన్యాన్ని పక్కదారి పట్టించడంతో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది. ఈ సీజన్‌లో కేటాయించిన ధాన్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వేలంలో కాంట్రాక్టర్లకు కేటాయింపులు చేసింది. అన్ని జిల్లాల పరిధిలో వేలం వేసిన ధాన్యాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించాలని ఆదేశాలు ఇచ్చింది. ఒకవేళ ధాన్యం నిల్వలు లేకుంటే వేలంలో నిర్ణయించిన విధంగా క్వింటాలుకు 2వేల రూపాయలను నగదు రూపంలో జమ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా కొన్ని మిల్లుల యజమానులు ధాన్యం నిల్వలను అందించారు. కాంట్రాక్టర్లకు పంపిణీ చేశారు. మరికొంత మంది మిల్లర్లు ధాన్యం నిల్వలకు అనుగుణంగా చెల్లింపులు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల పరిధిలో ఇంకా 330 మిల్లుల వరకు ఈ వేలంలో కేటాయించిన ధాన్యాన్ని అందించలేదు. దీనిపై దృష్టిపెట్టిన ప్రభుత్వం వీరి నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేయాలని నిర్ణయం తీసుకుంది. పౌరసరఫరాల సంస్థ ఎండీ డీఎస్ చౌహాన్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టింది. ఆయన ఆదేశాల మేరకు జిల్లాలో వేలంలో కేటాయించిన ధాన్యం ఇవ్వని 30మిల్లులపై తనిఖీలను చేపట్టారు. ఈ నెలాఖరులోపు నివేదిక ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఉన్న ఈ 30 మిల్లుల్లో ధాన్యం నిల్వలను ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలిస్తున్నారు. జిల్లాలో 2022-23 యాసంగిలో కేటాయించిన ధాన్యం నిల్వలకు అనుగుణంగా ఈ మిల్లుల్లో ఉన్నాయా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. పూర్తిస్థాయిలో వివరాలను తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న 30 మిల్లుల్లో ప్రత్యేక బృందాల ద్వారా ఈ తనిఖీలను చేపడుతున్నారు. ఆ సీజన్‌లో కేటాయించిన నిల్వలు లేకుంటే వాటిని ఎటువైపు మళ్లించారో వివరాలను తీసుకుంటున్నారు. నిల్వలకు అనుగుణంగా ధాన్యాన్ని గానీ, లేదా డబ్బులను కానీ వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వీరికి కొంతకాలం గడువు ఇవ్వడంతో పాటు ఆలోపు స్పందించకుంటే చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో డిఫాల్ట్ ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయించని అధికారులు మిగతా మిల్లులపైన కూడా అదేరీతిలో చర్యలను చేపడుతున్నారు.

రూ.100 కోట్ల వరకు కేటాయించిన ధాన్యం

జిల్లాలో ఈ మిల్లులకు కేటాయించిన ధాన్యం సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ నిల్వలకు అనుగుణంగా లేకుంటే నిర్ణీత సమయంలో మిల్లర్ల నుంచి డబ్బులను వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 2019 నుంచి 2022 వరకు నాలుగు సీజన్‌లో కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టింది. సుమారు 62 మిల్లుల్లో 243కోట్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఆ మిల్లులపై పూర్తిస్థాయిలో తనిఖీలు చేయ డంతో పాటు నోటీసులను ఇచ్చారు. నోటీసులకు స్పందించని మిల్లులపై క్రిమినల్ కేసులను పెట్టడంతో పాటు ఆర్ఆర్ యాక్ట్ కింద డబ్బులు వసూలు చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు. ఈ మిల్లులకు కూడా ధాన్యం కేటాయించిన వేలంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఇవ్వకపోవడంతో ప్రస్తుతం కమిటీలను కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయి నివేదిక పంపించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా చర్యలను చేపట్టనున్నారు. పౌరసరఫరాల సంస్థ ఎండీ ఆదేశాల మేరకు జిల్లాలోని 30మిల్లుల్లో తనిఖీలను చేపడుతున్నామని జిల్లా మేనేజర్ ఏ.రాజేశ్వర్ తెలిపారు. ప్రత్యేక బృందాల ద్వారా ఈ తనిఖీలను చేస్తున్నామన్నారు. నిర్ణీత సమయంలో నిర్ణయం తీసుకోవడంతో పాటు ధాన్యం నిల్వలకు అనుగుణంగా వసూలు చేసేందుకు చర్యలు చేపడుతామని ఆయన తెలిపారు.

అధ్వానంగా పోలీసు క్వార్టర్లు

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- అద్దెకుంటున్న బెటాలియన్‌కు చెందిన 350 కుటుంబాలు
- నూతన భవనాలను ఏర్పాటు చేయాలంటున్న సిబ్బంది



7

లక్షలు ఖర్చు చేసినా.. లక్ష్యం నెరవేరలే!

- అధ్వానంగా బృహత్ పల్లె ప్రకృతి వనం.. కమ్యూనిటీ ప్లాంటేషన్లు
- కనిపించని 15 ఎకరాల్లో మొక్కలు
- మూన్నాళ్లకే నేలకొరిగిన రక్షణ కంచె



7

గుట్టలు మాయం

- ఎడపల్లి మండలంలో గుట్టలను తవ్వేస్తున్న మొరం మాఫియా
- అభివృద్ధి ముసుగులో అక్రమ దందా
- కనుమరుగవుతున్న ప్రకృతి సంపద



7



పదవుల కోసం కాంగ్రెస్ నేతల.. ఎదురు చూపులు

- పదవుల కోసం ఎదురు చూస్తున్న అధికార పార్టీ నేతలు
- పార్టీ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల నజర్
- పోటా పోటీగా ఆశావహుల కార్యక్రమాలు
- స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు

నిజామాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీలో నేతలు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ పూర్తి కావడంతో ఇతర పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ పదవులతో పాటు స్థానిక సంస్థలపై దృష్టి పెట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల పరిధిలో అధికార పార్టీలో పదవుల కోసం పోటీ పెరగగా పాత, కొత్త నేతల మధ్య వైషమ్యాలు కూడా పెరుగుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల పరిధిలో పోటాపోటీగా నేతలు కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మరికొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలు సర్దిచెప్పి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఎక్కువ మందికి పదవులు వస్తాయని నచ్చచెబుతూ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. కొంత మంది నేతలు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తుండగా మిగతా వారు ఏదైనా ఒక పదవిని ఇవ్వాలని సీనియర్ నేతలను, ప్రజాప్రతినిధులను కలుస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు.

పదవులపై ఆశావహుల దృష్టి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం దగ్గరపడుతోంది. ఇప్పటికీ కొంత మంది నేతలకు రాష్ట్రస్థాయి పదవులు వచ్చినా.. మరికొంత మంది నేతలకు జిల్లాస్థాయిలో పదవులు వచ్చాయి. నామినేటెడ్ పదవుల్లో సీనియర్ నేతలకు అవకాశాలను కల్పించారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వం ఏర్పడటంతో ఎక్కువ మంది నేతలు పదవులపై దృష్టిపెట్టారు. పార్టీ కోసం కష్టపడి పనిచేశామని తమకు అవకాశం వస్తుందని సంవత్సరం పాటు ఎదురు చూశారు. నామినేటెడ్ పదవులు జిల్లా, రాష్ట్రస్థాయిలో భర్తీ కావడంతో ఇతర పదవుల కోసం ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఐదు వచ్చాయి. మొదట పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు రాష్ట్రస్థాయిలో ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. తర్వాత పీసీసీ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆయనతో పాటు సీనియర్ నేత తాహెర్‌బిన్ హుందాన్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియామకం చేశారు. జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్‌గా నియమించారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ను రాష్ట్ర కనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డిని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియామకం చేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గడుగు గంగాధర్‌ను రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యునిగా నియామకం చేశారు. వీరితో పాటు జిల్లాస్థాయిలో గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతరెడ్డిరాజరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డితో పాటు ఇతర నేతలకు అవకాశం కల్పించారు. జిల్లాలోని మార్కెట్ కమిటీలలో చైర్మన్‌లుగా నియామకం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులు దాదాపు పూర్తయ్యాయి. జిల్లా స్థాయిలో కేవలం దేవాలయ కమిటీలు మాత్రమే ఉన్నాయి. ప్రధాన పదవులు ఏవీ లేకపోవడంతో ఎక్కువ

మిగతా 8వ పేజీలో...

తెలంగాణలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ అరాచకాలే

● ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎక్కడ చూసిన కాంగ్రెస్ అరాచకాలే కనిపిస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని రాక్షస పాలన అని అన్నారు. లగచర్ల నుంచి దిలావర్‌పూర్ వరకు గ్రామం ఏదైనా.. కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలు తిరగబడుతున్నారని అన్నారు. నిత్యం ప్రజల తిరుగుబాటుతో రాష్ట్రం శ్రీలంక దేశాన్ని తలపిస్తుందన్నారు. రైతులతో పెట్టుకున్న వాళ్లు ఎవరూ బాగుపడలేదని బషీర్‌బాగ్‌లో రైతులను చంపించిన చంద్రబాబు నాయుడు సర్దుకొని పోయాడని అన్నారు. రేవంత్‌రెడ్డికి చంద్రబాబు పట్టిన గతే పడుతుందన్నారు. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో కాంగ్రెస్ అవినీతికి అంతు లేకుండా పోయిందన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ బంధువుల అవినీతికి జిల్లా బలవుతుందన్నారు. ఈరవత్రి అనిల్ ఇసుక దందాలు, సుదర్శన్ రెడ్డి లిక్కర్ వ్యాపారంలో మునిగితేలుతున్నారని అన్నారు. ఆర్మూర్‌లో కాంగ్రెస్ నాయకుడు వినయ్‌రెడ్డి అవినీతికి పాల్పడుతూ ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. ఇదేమి అన్యాయమని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్ నగర మేయర్ భర్తపై అక్రమంగా కేసులు పెడుతున్నారని అన్నారు. అధికారులు అతి చేస్తున్నారని వారి పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తామన్నారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అయేషా ఫాతిమా షకీల్, సీనియర్ నాయకులు రాంకిషన్‌రావు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సిర్పరాజు, రవిచందర్, శంకర్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ దీక్షా దివస్..

నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10 గంటలకు వినాయక్‌నగర్‌లోగల అమరవీరుల స్థూపానికి నివాళులర్పించనున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేయనున్నారు. ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్ నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ అంటేనే త్యాగాల పార్టీ : ఎమ్మెల్యే భూపతిరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటేనే ప్రాణత్యాగాల పార్టీ అని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం రూరల్ మండలంలోని కేశాపూర్ గ్రామంలో 5కోట్ల 43లక్షల రూపాయలతో జరుగుతున్న వివిధ పనుల అభివృద్ధి కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణత్యాగాలు చేసిందని అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదని విమర్శించారు. కేశాపూర్ గ్రామస్థులు తన గెలుపు కోసం ఎంతో కృషి చేశారని, గ్రామాభివృద్ధి కోసం తాను నిరంతరం పాటుపడతానని ఎమ్మెల్యే అన్నారు. 42లక్షల మంది రైతులకు 31వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఈ సంవత్సరం అత్యధికంగా 9లక్షల టన్నుల ధాన్యాన్ని పండించి దేశంలో మొదటి స్థానం నిలిచిందన్నారు. బిజెపి పార్టీ అధికారంలో ఉన్న 15 రాష్ట్రాల్లో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి అక్కడ జరగడం లేదని విమర్శించారు. బిజెపి రాష్ట్రాల్లో రైతు రుణమాఫీ చేయలేదన్నారు. ఇక్కడ చేస్తే ఆ పార్టీ నాయకులు విమర్శించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై పోటీ చేశారని విమర్శించారు. కేశాపూర్ గ్రామంలో ఉన్న నిరుపేదలకు ఇండ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు బాగారెడ్డి, అమృతాపూర్ గంగాధర్, ఎల్లయ్య, రాజేంద్రప్రసాద్, పూర్ణచందర్, సాయరెడ్డి, రామకృష్ణ, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి చిన్నారి మృతి


మృతిచెందిన చిన్నారి ధనస్వి

ఆర్మూర్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని రాంనగర్‌లో గురువారం ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడి మట్ట ధనస్వి(4) అనే చిన్నారి మృతి చెందింది. రాంనగర్‌లో నివాసముండే మట్ట ప్రశాంత్ జ్యోతి దంపతుల కూతురు ధనస్వీ ఉదయం ఆడుకుంటూ వెళ్లిన ఇంటి ఎదుట ఉన్న డ్రైనేజీలో పడిపోయింది. చిన్నారి తల్లిదండ్రులు తమ కూతురు కోసం కాలనీ అంత గాలించిన ఆచూకి లభించలేదు. చివరికి డ్రైనేజీలో చిన్నారి మృతదేహం కన్పించింది. అప్పటి వరకు తమ కళ్ళఎదుట ఆడుకుంటు కనిపించిన కూతురు డ్రైనేజీలో పడి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఆర్మూర్‌లో గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్

ఆర్మూర్‌టౌన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మామిడిపల్లిచౌరస్తాలో ఒక కిలో 100గ్రాముల గంజాయిని పట్టుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్ తెలిపారు. గురువారం మామిడిపల్లిచౌరస్తాలో తెలిసిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా మహమ్మద్ వహీద్ అనే వ్యక్తి మోటర్‌సైకిల్‌పై మామిడిపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా అతని పట్టుకొని తనిఖీలు నిర్వహించగా ఎండు గంజాయి ఒక కిలో 100గ్రాములు లభించింది. దీంతో గంజాయితో పాటు పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎస్సై చంద్రమౌళి, సందీప్, గంగాధర్, శ్రీనివాస్; సాగర్, నరేష్, దేవిదాస్, సాయిబాబా, మోహన్, ధర్మేందర్‌లు ఉన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో

భీమ్‌గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఎంపీడీవో సంతోష్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనును, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనశాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, ప్రస్తుత శీతకాలం చలి ఎక్కువ ఉన్నందున అన్ని గదులకు కిటికీ లు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని హాస్టల్‌వార్డెకు సూచించారు. అలాగే మూత్ర శాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలని హాస్టల్ సిబ్బందికి తెలిపారు.

కొనసాగుతున్న సామాజిక సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ

నవీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీవో రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల, మండల పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయం, ఐకేపీ కార్యాలయంలలో 35 కంప్యూటర్ల ద్వారా ఇంటింటి సర్వేకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 38శాతం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిందని, ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కావాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ కార్మికులకు జీవనభృతి ఇవ్వకుంటే తగిన బుద్ధి చెబుతాం

● ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.రామకృష్ణ



మోర్తాడ్‌లో వ్యవసాయ కూలీల భారీ ఊరేగింపు

మోర్తాడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవనభృతి ఇచ్చి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలుపుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. గురువారం మోర్తాడ్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మికుల జీవనభృతి అమలు కోసం భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తొలుత మోర్తాడ్ జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వ్యవసాయ కూలీలకు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకారులతో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో 50శాతంపైగా వ్యవసాయ కూలీలు ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో 55శాతం పైగా వ్యవసాయ కార్మికులకు ఉన్నారని, వీరికి ఏడాది పొడవున పని దొరకడంలేదని, దొరికిన పనిదినాలలో తక్కువ ఆదాయం వస్తుందని, దీని వల్ల విద్య, వైద్యం, గృహ వసతిలేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధా నకార్యదర్శి జీ.కిషన్, ప్రగతిశీల రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్, పీవో డబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షుడు సత్తెమ్మలు ప్రసంగించారు. జిల్లా కోశాధికారి బి.అశోక్, డివిజన్ మండల నాయకులు దామోదర్, దయాల్‌సింగ్, పోశెట్టి, నాని, అంజలి, శ్రీనివాస్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు జ్యోతిబా పూలే విద్యార్థినుల ఎంపిక

బోధన్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముఖి జిల్లాస్థాయి పోటీలకు సాలూర మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి చెకిముకి పోటీలకు జ్యోతిబాపూలే విద్యార్థినులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జిల్లాస్థాయి పోటీలలో ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులు మంజుల, పవిత్ర, కృష్ణవేణిలను అభినందించారు. జిల్లాస్థాయి చెకుముఖి పోటీలు గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డీజీ పాఠశాలలో జరిగాయని వీటిలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి ప్రశంస పత్రాలు గెలుచుకున్నారన్నారు.

ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

పెర్కిట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజలకు ఐదు డిమాండ్‌లు, ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, ఎకరం భూమి, 200 గజాల నాలుగు గదుల ఇళ్ల అమలు కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ధర్మసమాజ్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఐదు డిమాండ్‌లను వెంటనే అమలు చేయాలని, లేని యెడల ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గజానంద్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకుడు కాన్షిరాం, మహేష్, కిషన్, సాయిరాం, నితిన్, జైచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు మెమోరాండం అందజేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

మోర్తాడ్‌లో ఘనంగా జ్యోతి బాపూలే వర్ధంతి


పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బార్ అసోసియేషన్


వేల్పూర్‌లో నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ సంఘం సభ్యులు

మోర్తాడ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయరహదారి పక్కన గల జ్యోతి బాపూలే 134వ వర్ధంతిని దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడు మల్లూరి రాజారాం జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, శ్రీనివాస్, భావన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అణగారిన అభ్యున్నతి కోసం కుల వ్యవస్థ నిర్మూలన విద్య కోసం జ్యోతిబాపూలే పని చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు పోడెటి శంకర్, డి.అరుణ్ కుమార్, సుకేష్, చరణ్‌కుమార్, సరసం చిన్నారెడ్డి, శ్రీధర్, జగన్, ప్రవీణ్, కృష్ణం రాజు, కీర్తిసాగర్, బాబాయ్య, కిషన్ పాల్గొన్నారు.

వేల్పూర్: మండల కేంద్రంలో జాతిపిత మహాత్మ జ్యోతిరావుపూలే 144వ వర్ధంతి కార్యక్రమాన్ని అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి విద్య, అందించిన మహనీయుడు, త్యాగమూర్తి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. యువకులు జ్యోతిరావుపూలే జీవిత చరిత్రను తెలుసుకొని ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి జంబవ చమర్, ఉపాధ్యక్షుడు అజయ్, నారాయణ,అనిల్, జనార్ధన్ ఉన్నారు.

భీమ్‌గల్: పట్టణంలో జ్యోతిబాపూలే వర్ధంతిని కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి బాపూలే విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పర్స అనంత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జెజె నర్సయ్య, ఎస్టీసెల్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, మండల యూత్ అధ్యక్షుడు బర్ది అవినాష్, బొర్రన్న, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీకి కన్నీటి వీడ్కోలు

● చివరి చూపుకు తరలివచ్చిన వేలాది జనం
● అంతిమయాత్రలో ఎమ్మెల్యే పోచారం, మాజీ ఎమ్మెల్యే


శివరాజ్ దేశాయ్ పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ శివరాజ్ దేశాయ్‌తో పాటు ఆయన తనయుడు రాజు దేశాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం గ్రామంలో వారిద్దరి పార్థివ దేహలకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తండ్రి కొడులకు మృతి పట్ల తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. శివరాజ్ దేశాయ్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకురావడంలో శివరాజ్ దేశాయ్ ముందుండే వారని ఆయన మృతి తీరని లోటన్నారు. శివరాజ్ దేశాయ్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. శివరాజ్ దేశాయ్ అంతిమ యాత్రకు కోటగిరి మండలంతో పాటు మహరాష్ర్ట, కర్నాటక ప్రాంతాల నుంచి బంధువులు, పలువురు నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి శివరాజ్ దేశాయ్ పాడేను మోశారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. శివరాజ్ దేశాయ్ గ్రామాభివృద్ధికి, గ్రామస్థులకు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, గంగారాంతో పాటు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● బీసీ వెల్ఫేర్ అధికారి స్రవంతి

బోధన్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలని బీసీ వెల్ఫేర్ అధికారి స్రవంతి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కబడ్డీ, వాలీబాల్ క్రీడపోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నెలకొన్న క్రీడ నైపుణ్యాలను వెలికి తీయడానికి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు క్రీడాల్లో మరింతగా రాణించడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహయ సంక్షేమ అధికారి నర్సయ్య, గంగాధర్, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ధర్నా

కోటగిరి,నవంబరు28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో వికలాంగులు, వితంతువులు, బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రభుత్వం వికలాంగులకు 6వేలు, వృద్దులు, వితంతువులకు 4వేలు పింఛన్ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం సరికాదన్నారు. పింఛన్ పెంచడంతో పాటు ప్రతి నెల 5వ తేదిలోపు పింఛన్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతోద్యయ కార్డు ద్వారా 35కిలోల బియ్యంతో పాటు ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూమ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదిన బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఒక రోజు రిలే దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్.నసీర్, మండల నాయకులు శివ, సాయిలు పాల్గొన్నారు.

ఎన్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలి

● బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య

బోధన్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 4న నిర్వహించే ఎన్ఏఎస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేయాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని డిప్యూటీ డీఈవో కార్యాలయంలో బోధన్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐటీ మీద రివ్యూ సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారిగా, తరగతుల వారీగా సబ్జెక్టుల వారీగా సమ్మెటివ్ అసిస్టెంట్ వివరాలు, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష వివరాలను రివ్యూ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు సూర్య కుమార్, రత్నాకర్, ఆరీఫోద్దీన్, సీఆర్‌పీలు విజయ్ బాబు, యూసుఫ్, విజయ, రేఖ, శివానంద్ పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహానికి స్థలాన్ని కేటాయించాలి

ఆర్మూర్‌టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని స్వామి వేకానంద విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని బీజేపీ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. విగ్రహ ఏర్పాటుకు పట్టణంలోని ప్రజలు, విద్యావంతులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు, విద్య, వైద్య సంస్థల సముదాయాలు సహకరించాలని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, సుంకరి రంగన్న, మీర్యాలకర్ కిరణ్, మందుల పోశెట్టి, అంతజి అజారి శ్రీనివాస్, పీర్ షింగ్‌నాయక్, దక్షిణమూర్తి, రాము, సాయన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు



నవీపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్ సింగ్ గురువారం రాత్రి పెర్కిట్ బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని అంత్యక్రియలు గురువారం అతని స్వగ్రామామైన ఫకీరాబాద్‌లో నిర్వహించారని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య కౌసల్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ అంత్యక్రియలలో ఏఆర్ ఏసీపీ నాగయ్య, ఆర్ఐ అడ్మిన్ సతీష్, ఆర్ఐ ఎంటీవో తిరుపతి, అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, సిబ్బందితో పాటు పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

ముప్కాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 7నుంచి 10వ తేదీ వరకు హైదరా బాద్‌లో జరిగే 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే బాలికల నిజామాబాద్ జిల్లా జట్టు ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసిసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగాధర్ తెలిపారు. 150మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో మంచి ప్రతిభ కనబరిచిన 20మంది క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపిక చేసిన క్రీడాకారులకు డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ముప్కాల్ ఇండోర్ స్టేడియంలో మంచి శిక్షణ ఇచ్చిన ఫైనల్ కు 12మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు సురేందర్, రాజ్‌కుమార్, మల్లేష్‌గౌడ్, రాజేందర్, సురేష్, ప్రసాద్, అనురాధ, స్పోర్ట్స్ అకాడమి సభ్యులు అంజయ్య, సాయన్న, గంగారాం, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన విద్యార్థికి అభినందన

రెంజల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని మాలతి ఇటీవల సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో నిర్వహించిన ఎస్ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో 58కిలోల కాంస్య పతాకం 3వ స్థానం సాధించడంతో గురువారం విద్యార్థిని మాలతిని పాఠశాల ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. మాలతి రాష్ట్రస్థాయిలో కాంస్య పతాకం సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడాల్లో ప్రాధాన్యత లభించడంతో మాలతిని ఆదర్శంగా తీసుకుని మరింత ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, శంకర్, రాజేందర్, ప్రతాప్, సురేష్, రాధ, స్వప్న, ఇంతియాజ్, పీడీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి పాఠశాల విద్యార్థిని ఎంపిక

కమ్మర్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినిరాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవిందర్, వ్యాయమ ఉపాధ్యాయుడు సంజీవ్ తెలిపారు. ఈ నెల 19 న కల్లెడిలో జరిగిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో క్రీడా ప్రతిభను కనబర్చినందుకు గాను ఈ ఎంపిక జరిగినట్లు తెలిపారు. ఈ నెల 29, 30, డిసెంబరు 1 న మూడు రోజుల పాటు ఆర్మూర్‌లో నిర్వహింపబడే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టు తరఫున విద్యార్థిని వినేహ పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలిక వి.నేహాను అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.


ఉప్లూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఉప్లూర్‌లో ఘనంగా ఊర పండుగ

కమ్మర్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ఊర పండగను ఘనంగ జరిపారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గత రెండు రోజులగా గ్రామంలో ఊరపండగను గ్రామస్థులు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామరక దేవుళ్లను నూతనంగా ప్రతిష్ఠించారు. గ్రామ ప్రధాన వీదుల గుండ సాగిన బోనాల ఊరేగింపులో పెద్ద సంఖ్యలో గ్రామ మహిళ పాల్గొన్నారు. పోతరాజుల విన్యాసాలు ఆకర్షనగా నిలిచాయి. అనంతరం గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు సోమదశరత్, సుకరి విజయ్ కుమార్, బెనగిరి రాజేశ్వర్, సాంబారు అశోక్, చింతకుంట శ్రీనివాస్, నరేందర్, చిన్నయ్య, పోతరాజులు ప్రమోద్, అశ్వపతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా విరుద్ధం

● ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో రాధిక



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో రాధిక

బోధన్‌రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సాలూర మండలం పెంటాఖుర్దు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్ వికాస్ ముక్త్ భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహలు జరగకుండా ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉండాలనిఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో రాధిక పేర్కొన్నారు. 18సంవత్సరాల లోపు ఆడపిల్లలకు వివాహం జరిపిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. మాత, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగావేణి, జిల్లా మిషన్ సమన్వయకర్త స్వప్న, హెడ్‌మాస్టర్ రత్నాకర్, అంగన్‌వాడీ టీచర్‌లు శ్రీదేవి, సురేఖ, రాధాలక్ష్మి, హేమంత పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

●కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ


చౌట్‌పల్లిలో నారుమడిని పరిశీలిస్తున్న ఏవో రమ్యశ్రీ

కమ్మర్‌పల్లి, నవంబరు 28: (ఆంధ్రజ్యోతి) యాసంగి పంటల నిమిత్తం రైతులు తమ పొలాల్లో వేసుకున్న వరినారుమళ్లు అధికంగా వీస్తున్న చలిగాలుల వల్ల ఎర్రబడిపోతున్నదని కమ్మర్‌పల్లి మండల వ్యాప్తంగా అదే పరిస్థితులు నెలకొని ఉన్నాయని రైతులు సస్యరక్షణ చర్యలే చేపట్టాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాదికారి టీ రమ్యశ్రీ అన్నారు గురువారం కమ్మర్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి వరినారుమళ్లను ఆమె స్థానిక ఏఈవోలతో రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సాయంత్రం వేళల్లో నారుమడి నుండి నారుమడి నుంచి నీటి తొలగించి ఉదయమే తిరిగి నీరందించాలి నారుమడి వేసే ముందు ఒకఏరానికి కిలో జింగ్ సల్ఫేట్ వేయాలి. జింగ్ సల్ఫేట్ వేసిన 2 లేదా 3 రోజుల తరువాత దుక్కిలో 20 20 0 లేదా డీఏపీ వేయాలి. జింక్, భాస్వరం కలిపి వేసినప్పుడు రసాయనిక చర్య జరిగి మొక్క జింక్‌ను తిసుకోలేదు. పొలం తయారి చేసుకునేటప్పుడు ఎకరాన 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, మట్ట మహేష్, సాయన్న, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో కార్తీక మాస వన భోజనాలు

బోధన్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో గురువారం కార్తీక మాసం వన భోజన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈస ందర్భంగా ఉద్యోగులకు, జీవిత భాగస్వాములకు వన భోజనాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే మానసిక ఉల్లాసం కోసం ప్రముఖ మ్యాజిషియన్ రంగనాథన్ మ్యాజిక్ షో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అనంతరం ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌తో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాసరచన పోటీలు

భీమ్‌గల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మెండోర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినిలు అర్తి ప్రథమ, నివేదిత ద్వితీయ, సయ్యద్ ఇహర్ తృతీయస్థానంలో గెలుపొందగా ఎంఈవో స్వామి బహుమతులను అందజేశారు. విద్యార్థిని ఆర్తి జిల్లా స్థాయి లో జరిగే వ్యాసరచన పోటీల్లో పాల్గొనున్నట్టు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింబాద్రి, రఘువాస్, వినోద్, మురళీ, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షానే కాంగ్రెస్ ప్రభుత్వం

వేల్పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లాప్పుడు రైతులకు అండగా ఉంటూ రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్ మార్కెట్ కమిటీలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్యంరెడ్డి మాట్లాడు తూ రైతులు అన్నిసమయాల్లో ఆనందంగా ఉండాలని, రైతులకు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరిగిందన్నారు. మిగిలిన రూ.2లక్షల పైన ఉన్న వారికి కూడా త్వరలోనే రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. రైతు పండగా సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి వర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంసీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, డైరెక్టర్‌లు జైడి రవి, నరేందర్, కిషన్ గౌడ్, బొంబాయి గంగాధర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

గుట్టలు మాయం!


● ఎడపల్లిలోని రాణాకలాన్‌లో గుట్టను తవ్వేసిన దృశ్యం

● ఎడపల్లిలో గుట్టలను కాజేస్తున్న వైనం ● అభివృద్ధి ముసుగులో మొరం దందా
● రెచ్చిపోతున్న మొరం మాఫియా, రియల్ వ్యాపారులు ● హరించిపోతున్న ప్రకృతి సంపద

ఎడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుట్టలు మాయమై పోతున్నాయి. ఏళ్ల తరబడిగా ప్రకృతి సంపదగా నిలిచిన గుట్టలు, కొండలు రాత్రికి రాత్రే కరిగిపోతున్నాయి. మండలంలో గుట్టలను దర్జాగా కాజేస్తున్నారు. మొరం మాఫియా, రియల్ వ్యాపారుల కనుసన్నల్లో గుట్టలను, కొండలను తవ్వేస్తున్నారు. అభివృద్ధి ముసుగును కప్పి మొరం దందాకు దర్జాగా తెరలేపుతున్నారు. ప్రకృతి సంపద హరించిపోతున్న ప్రశ్నించాల్సిన అధికారులు అడ్డుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. గుట్టల మాయం వెనుక రెవెన్యూ అధికారుల పాత్ర కీలకంగా మారింది. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే బహిరంగంగా గుట్టలను తవ్వివేస్తున్నారు. పల్లెల్లో ఊరికి చివర ఉన్న గుట్టలు నేడు కనుమరుగయిపోతున్నాయి. మొరం వ్యాపారం కోసం కొందరు, అభివృద్ధి పనుల పేరిట మరికొందరు, ఇళ్ల స్థలాల ముసుగులో మరికొందరు ఇలా గుట్టలను టార్గెట్‌గా చేస్తున్నారు. గుట్టలను తవ్వి ఖాళీ జాగాలలో ఆక్రమణలు చేస్తున్నారు. గుట్టలు, కొండలు మాయమవుతున్న కళ్లెదుటే ప్రకృతి సంపద నశించిపోతున్న రెవెన్యూ అధికారులు ప్రశ్నించలేక పోతున్నారు. కనీసం ప్రకృతి సంపదను కాపాడలేకపోతున్నారు. అదేమిటంటే అధికార యంత్రాంగం నోరు మెదపడం లేదు. కానీ గుట్టలు, కొండలు కరిగి పోయి సజీవ సాక్షంగా మిగిలిపోతున్నాయి. మండలంలో గుట్టలు, కొండలు హరించిపోతున్నాయి. కళ్లెదుటే గుట్టలు మాయమవుతున్న అధికార యంత్రాంగం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తుండడం వెనుక పెద్ద ఎత్తున జేబులు మారుతున్నాయన్న ప్రచారం సాగుతుంది. రియల్ వ్యాపారులు గుట్టలు, కొండలను దర్జాగా మింగేస్తున్నారు. ఆదివారం వస్తే చాలు, సెలవు దినాలు వస్తే చాలు మొరం మాఫియాకు అడ్డుకట్టలు లేకుండా పోతున్నాయి. రెవెన్యూ అధికారులే మొరం మాఫియా, రియల్ వ్యాపారులు ప్రజాప్రతినిధులకు సెలవు దినాలను గుట్టలు తవ్వేందుకు ఎంచుకోవాలని సూచనలు ఇస్తుండడం కొసమెరుపు. సెలవు దినాలలో ఫిర్యాదులు చేస్తే తాము విధుల్లోకి వచ్చాక పరిశీలిస్తామని తప్పించుకుంటున్నారు. గుట్టల మాయం వెనుక రెవెన్యూ అధికారుల అండదండలు కీలకంగా మారాయి. మండలంలో గోరంగా గుట్టలు మాయమవుతున్న జిల్లా యంత్రాంగం, మైనింగ్ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది కొరత అంటూ మైనింగ్ శాఖ చేతులు ఎత్తేస్తుండడం మొరం మాఫియాకు రియల్ వ్యాపారులకు గుట్టలు తవ్వే బకాసురులకు కల్పతరువుగా మారింది.


అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

మండలంలోని పదుల సంఖ్యలో గుట్టలు మాయం

ఎడపల్లి మండల పరిధిలో పెద్దఎత్తున గుట్టలు మాయమయ్యాయి. గత కొంతకాలంగా దర్జాగా దందా సాగుతోంది. మండలంలో పదుల సంఖ్యలో గుట్టలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఎడపల్లి మండల పరిధిలోని వడ్డాపల్లి, జంలం. జానకంపేట, రాణాకలాన్, పోచారం గ్రామాలలో పెద్దఎత్తున గుట్టలు కనుమరుగయ్యాయి. మొరం మాఫియా, ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా గుట్టలు మాయం చేశారు. అధికారుల కళ్లెదుటే గత కొంత కాలంగా పెద్ద గుట్టలు మాయమయ్యాయి. రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. గుట్టల మాయం వెనుక పెద్ద మర్మం దాగివుంది. గుట్టలను తవ్విమొరం అమ్మకాలు ముగిశాక ఆభూములను అయితే పంట భూములు లేదంటే ప్లాట్లుగా మార్చి దర్జాగా కాజేస్తున్నారు. ఈ తతంగం వెనుక ప్రజాప్రతినిధులు కొందరు ముఖ్య భూమికలు పోషిస్తున్నారు. గుట్టల మాయం బహిరంగంగా జరుగుతున్న రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం లేదు. కనీసం ప్రశ్నించడం లేదు. గుట్టలు మాయం వెనుక రెవెన్యూ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ప్రభుత్వ భూములను తవ్వలన్న వాటిలో యంత్రాలతో తవ్వ కాలు చేయాలన్న గుట్టలను మాయం చేయాలన్న భయం లేకుండా పోయింది. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు ఏ ఒక్క చోట కనీసం కేసులు పెట్టడం లేదు. రెవెన్యూ ప్రభుత్వ భూముల్లో దర్జాగా దందా సాగుతున్న రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

అభివృద్ధి ముసుగులో దందా

గుట్టల మాయం వెనుక లోగుట్టు దాగివుంది. గుట్టలను కాజేసే క్రమంలో భారీ అవినీతి దందా చోటుచేసుకుంది. ఒక్కో గ్రామంలో ఒక్కో గుట్ట తవ్వకం వెనుక ఒక్కో కథ నెలకొంది. కొన్నిచోట్ల గ్రావెల్ రోడ్డు చేపట్టడానికని, మరోచోట గ్రామ అభివృద్ధికి అంటూ గుట్టలను మొరం, రియల్ మాఫియా మింగేస్తోంది. గుట్టలను ఆనవాళ్లు లేకుండా చేస్తున్న కనీసం రెవెన్యూ అధికారులు ఎందుకు తవ్వకాలు చేస్తున్నారని ప్రశ్నించకపోవడం కొసమెరుపు. ఇంకొన్ని చోట్ల అభివృద్ధి పనులకు మొరం తవ్వకాలు చేపడుతున్నామని గోరంత అనుమతులు తీసుకొని గుట్టలను మాయం చేస్తున్నారు. అభివృద్ధి ముసుగులో గుట్టలను కాజేసే ప్రక్రియ దర్జాగా సాగుతుంది. గుట్టలు మాయం అవ్వకుండా తవ్వకాలు చేపట్టకుండా అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. తెర ముందు అభివృద్ధి తెర వెనుక మరో ఏజెండాతో గుట్టలు మాయం అవుతున్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు కనీసం స్మశానవాటికలకు స్థలాలు కావాలన్న దొరికే పరిస్థితి లేకుండా గుట్టలనుమాయం చేస్తున్నారు. గుట్టల మాయం వ్యవహారంపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టిపెట్టాల్సి ఉంది.

ఇలా పట్టుకుని.. అలా వదిలివేసి..

ఎడపల్లి మండలంలో జోరుగా సాగుతున్న అక్రమ మొరం దందాపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే మాత్రం పోలీసులు మేమున్నామంటూ మొరం తరలిస్తున్న టిప్పర్‌లను ఇలా పట్టుకుని అలా వదిలివేస్తున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను ఆపి అనుమతులు చూయించమంటే ఇది ఫలానా మొరం వ్యాపారి టిప్పర్ అనగానే పోలీసులు వెను దిరగడం కొసమెరుపు. అక్రమ వ్యాపారి పేరు చెప్పగానే పోలీసులు వెనుదిరుగుతున్నారంటే ఈ అక్రమ మొరం దందా ఏ రేంజ్‌లో సాగుతుందో ఇట్టే అర్థమవుతుంది. అక్రమాలని నియంత్రించాల్సిన అధికారులే అక్రమార్కులకు వంత పాడటం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో.

అధ్వానంగా పోలీసు క్వార్టర్లు


బెటాలియన్‌లో శిథిలావస్థకు చేరిన పోలీసు క్వార్టర్


శిథిలావస్థకు చేరిన గదిలో మొలిచిన పిచ్చిమొక్కలు

● ఇతర గ్రామాల్లో అద్దెకుంటున్న పోలీసు సిబ్బంది ● నూతన భవనాలు నిర్మించాలని పోలీసులు వినతి

డిచ్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల కోసం నిత్యం విధుల్లో ఉంటున్న 7వ బెటాలియన్ పోలీసు సిబ్బందికి కేటాయిస్తున్న పోలీసు క్వార్టర్లు అధ్వానంగా మారాయి. దీంతో పోలీసు సిబ్బంది అక్కడ ఉండలేక బెటాలియన్ పక్కనగల గ్రామాల్లో అద్దెకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. 45 ఏళ్ల క్రితం నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరడం, నివాసానికి యోగ్యం లేకపోవడంతో పోలీసులు కుటుంబ సభ్యులు ఆ గదుల్లో ఉండేందుకు ఇష్టపడటం లేదు. దీంతో పోలీసు అధికారులే పాడుపడ్డ నివాస గృహాలను నేలమట్టం చేయడంతో మరికొన్ని గృహాల్లో పాల వ్యాపారం, కూరగాయాల వ్యాపారం చేసేవారు మాత్రం ఉంటున్నరని పోలీసులు పేర్కొంటున్నారు. బెటాలియన్ కు చెందిన 350 కుటుం బాలు ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి, నిజా మాబాద్, ధర్మారం, నడిపల్లి, ప్రాంతాల్లో వేల రూపాయలు అద్దె చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన వసతి గృహాలు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన గదుల పక్కన ముళ్లచెట్లు పేరుకుపోవడంతో పాములు, విష కీటకాలు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయని సిబ్బంది వాపోయారు.







బృహత్ పల్లె ప్రకృతి వనం ఇదే..

రూ.లక్షలు వెచ్చించినా.. నెరవేరని లక్ష్యం!

● అధ్వానంగా బృహత్ పల్లె ప్రకృతి వనం.. కమ్యూనిటీ ప్లాంటేషన్‌లు ● కనిపించని 15 ఎకరాల్లో మొక్కలు
● మూన్నాళ్లకే నేలకొరిగిన రక్షణ కంచె ● బృహత్ పల్లె ప్రకృతి వనం నిధులు ఏమైపోయాయని సర్వత్రా విమర్శలు

నిజాంసాగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం కింద లక్షలు ఖర్చు చేసినా ప్రభుత్వం లక్ష్యం నెరవేరలేదు. గ్రామాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలు కమ్యూనిటీ ప్లాంటేషన్ల పేరిట లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించింది. నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామంలో 560 సర్వే నెంబర్లు దాదాపు 15 ఎకరాల్లో 2021-22 సంవత్సరంలో బృహత్ పల్లె ప్రకృతి వన నిర్మాణానికి రూ.44లక్షల 58లక్షల 133లను నిధులను కేటాయించింది. బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని 10 ఎకరాలలో ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద 60శాతం ముడిసరుకు 40శాతం కూలీలకు చెల్లించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ఈ పనులను 2021 జూలైలో ప్రారంభించారు. పల్లె ప్రకృతి వనంలో కేవలం 31వేల మొక్కలు నాటారు. ఈ మొక్కలతో పాటు గతంలో అటవీ శాఖ అధికారులు నాటిన అడవి జాతులు మొక్కలు మాత్రమే ఏపుగా పెరిగి అక్కడక్కడ కనిపిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనం కింద నాటిన మొక్కలు ఆనవాళ్లు లేకుండాపోయాయి. ఈ వనంలో 31 వేల మొక్కలు ఎక్కడ నాటారని కూడా అంతు పట్టడం లేదు. బృహత్ పల్లె ప్రకృతి వనానికి ప్రభుత్వ యంత్రాంగం దాదాపు రూ.15లక్షల చెల్లించినట్లు రికార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఈ పథకం కింద 44 లక్షల 58.133 ఎస్టిమేట్‌లో ఉన్నప్పటికీ ఖర్చు 15లక్షల రూపాయలు చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఉపాధి హామీ పథకం కింద రెండు సంవత్సరాలు నిర్వహణకులు చేయాల్సినప్పటికీ సక్రమంగా నిర్వహణ లేక నాటిన మొక్కలఆనవాళ్లు లేకుండా పోయాయి. పల్లె ప్రకృతి వనానికి రక్షణ కంచె నిర్మాణం చేసినప్పటికీ రక్షణ కంచె మున్నాళ్లకే కూలిపోయి నేలకు ఒరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా బృహత్ పల్లె వనాలను ఏర్పాటు చేసిన అవి కళాహీనంగా మారిన పట్టింపు లేనట్లుగా అధికార యంత్రాంగం ఉండటం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే బృహత్ పల్లె ప్రకృతి వనంలో కమ్యూనిటీ ప్లాంటేషన్ కూడా ఏడు లక్షల 22 వేల ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ప్లాంటేషన్ ఐదు ఎకరాలు స్థలం ప్రత్యేకంగా కేటాయించకుండా బృహత్ పల్లె ప్రకృతి మొక్కలు నాటి కమ్యూనిటీ ప్లాంటేషన్‌ని కూడా రికార్డులు చేసినట్లు తెలుస్తుంది. కమ్యూనిటీ ప్లాంటేషన్ నాటిన మొక్కలను అధికారులు రికార్డులు చేసి లక్షల రూపాయలను తప్పు తోవ పట్టించినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ పథకం కింద ముడి సరుకు కోసం 60 శాతం డబ్బులను ఏజెన్సీకి చెల్లించారానేది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పది కాలాల పాటు పచ్చదనంగా ఉండేందుకే ప్రభుత్వం బృహత్ పల్లె ప్రకృతి వనాలు కమ్యూనిటీ ప్లాంటేషన్‌లను ఏర్పాటు చేశారు. అవి మూన్నాళ్లకే అంతరించిపోయాయి. ప్రణాళిక ప్రకారం మంజూరు చేసిన నిధులు ఎక్కడికి వెళ్లాయనేది ప్రశ్నార్థకమే. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి పల్లె ప్రకృతి కమ్యూనిటీ ప్లాంటేషన్ల మొక్కలు నాటి గ్రామాల ప్రజలకు కనువిప్పు చేసేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


బృహత్ పల్లె ప్రకృతి వనానికి నిధులు కేటాయించినట్టు తెలుపుతున్న శిలాఫలకం


పల్లెప్రకృతి వనానికి వేసిన రక్షణ కంచె నేలకొరిగిన దృశ్యం

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

వైస్ చాన్సలర్ యాదగిరిరావు

డిచ్‌పల్లి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం యువతి యువకులు అందరు కృషి చేయాలని టీయూ వీసీ యాదగిరి రావు పిలుపునిచ్చారు. గురువారం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన గోడ పత్రాలను వీసీ చాంబర్ లో వీసీ ఆవిష్కరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరకంగా మానసికంగా ఆర్థికంగా నష్టం జరుగుతుండటంతోపాటు ప్రాణనష్టం జరుగుతుందని తెలిపారు. గంజాయి, సిగరెట్ ఆల్ఫాజోలుమ్‌తో తయారుచేసిన కల్తీ కల్లుకు బానిసలుగా మారవద్దన్నారు. దీంతో భవిష్యత్తు పరిణామాలు దారుణంగా ఉంటాయని ప్రతి ఒక్కరు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. త్వరలో తెలంగాణ వర్సిటీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తామని, విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, తదితరులున్నారు.



నార్కొటిక్ బ్యూరో రూపొందించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ యాదగిరి రావు

బొప్పాయితో అందం, ఆరోగ్యం!



● రోగ నిరోధక శక్తిని పెంచుతున్న బొప్పాయి

బోధన్‌రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మనం నిత్యం బొప్పాయి పండ్లను మార్కెట్‌లో చూస్తుంటాం. కానీ అంతగా పట్టించుకోము. బొప్పాయి ఆరోగ్యానికే కాదు.. అందానికి కూడా ఎంతగానో దోహదపడుతుంది. దీన్ని తినే ముందు ఎవరైనా ఒక్కక్షణం ఆలోచిస్తారు. ఎందుకంటే బొప్పాయి తింటే వేడిచేస్తుందని, ఇలాంటి భయాలు, అపోహలు దూరం కావాలంటే శరీరానికి అది చేసే మేలు ఏంటో తెలుసుకోవాల్సిందే.

ఆరోగ్యానికి ఎంతో మేలు

బొప్పాయిలో కొవ్వు, మాంసకృతులు తక్కువ మోతాదులో ఉంటాయి. వందగ్రాముల బొప్పాయి పండులో 32కెరీలతో పాటు సోడియం ఏ, బీ, సీ విటమిన్లు కెరోటిన్, బీటా కెరోటిన్ వంటి ఖనిజా లవణాలు లభిస్తాయి. దీనిలోని విటమిన్ సీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మిటమిన్ ఏ సమృద్ధిగా ఉండటం వల్ల దృష్టిలోపాలను సైతం తగ్గిస్తుంది. ఈ పండులో ఉండే పాపామ్‌లు, ఎంజైమ్‌లు మన జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. మాంసకృతులు త్వరగా జీర్ణమవ్వడానికి ఉపకరిస్తాయి. అందుకే దీనిని మాంసంతో కలిపి ఉడికిస్తారు. ఒంటి నొప్పుల నివారణలో సామర్థవంతంగా పనిచేస్తుంది.

అందం.. ఆనందం

స్నానం చేయడానికి అరగంట ముందు బొప్పాయి పండు గుజ్జును శరీరానికి పట్టించాలి. ఇందులోని విటమిన్లు చర్మాన్ని కాంతివంతంగా చేసేందుకు దోహదపడతాయి. అంతే కాకుండా చర్మ సంబంధిత వ్యాధులు, సమస్యలను తగ్గిస్తుంది. బొప్పాయి చెట్టు పూలను పేను కొరుకుడు నివారణకు వాడుతారు. పచ్చి బొప్పాయికాయ పొట్టును మెత్తగా చేసి దానికి కొంచెం వెనిగర్ చేర్చి ముఖానికి ప్యాక్‌లా వేసుకుంటే మొటిమలు, నల్లమచ్చలు తగ్గుముఖం పడతాయి. దీనిని పాదాలకు రాస్తే పగుళ్లు తగ్గుతాయి. బొప్పాయి గుజ్జు వెనిగర్‌ను నిమ్మరసాన్ని సమపాలలో కలిపి శాంపు మాదిరిగా తయారు చేయాలి. దీని జట్టుమొత్తానికి రాసుకుని కొన్ని నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. చుండ్రు నివారణలో ఇది మంచి ఔషధం, పచ్చి బొప్పాయి నుంచి తీసిన పాలను కమిలిన చర్మంపై రాస్తే కొద్ది రోజుల్లోనే చర్మం సాధారణ రంగులోకి వస్తుంది.

మంచి ఔషధంగా పని చేస్తుంది

దీనిలో పుష్కలంగా ఉండే చీటా కెరోటిన్ శరీరానికి హానీ చేసే ఫ్రీ రాడికల్స్ దుష్పలితాలను నివారించి క్యాన్సర్ రాకుండా నియంత్రణలో ఉంచుతుంది. బొప్పాయిలోని పీచు పదార్థం మలబద్ధకానికి మంచి ఔషధం. నెలసరి సమయంలో సమస్యలతో బాధపడే మహిళలు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేసి రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. మూత్రవిసర్జన సమస్యలతో బాధపడేవారికి ఇది చక్కటి పరిష్కారం. అధిక రక్తపోటుతో బాధపడే వారికి ఉదయం అల్పాహారం తీసుకోవడానికి అర గంట ముందు బొప్పాయిపండు ముక్కలు తింటే సమ స్యలు అదుపులో ఉంటుంది. మధుమేహం, ఉబ్బస వ్యాధిగస్తులు మాత్రం వైద్యుల సలహ మేరకు తీసుకోవాలి. గర్భిణీ స్త్రీలు మాత్రం వీటికి దూరంగా ఉండాలి.

ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది

● సుధాకర్, వైద్యులు బోధన్



బొప్పాయి పండు మనం తినే ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బొప్పాయిలో ఉండే సోడియం ఏ, బీ, సీ విటమిన్లు కెరోటిన్, బీటా కెరోటిన్ వంటి ఖనిజా లవణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. జ్వరంతో బాధపడే వారికి కూడా ఇది మంచి ఔషదంగా పని చేస్తుంది. బొప్పాయి తినడం అలవాటుగా మార్చుకొంటే మంచి ప్రయోజనం చేకూరుతుంది.

పదవుల కోసం కాంగ్రెస్ నేతల ఎదురు చూపులు

(ఐదో పేజీ తరువాయి)

మంది పార్టీ పోస్టులతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సర్పంచుల నుంచి జడ్పీటీసీల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదవీకాలం కూడా అయిపోయి దాదాపు ఆరు నెలలు దాటిపోయింది. సర్పంచుల పదవీకాలం అయిపోయి పదినెలల సమయం గడుస్తుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే పూర్తయిన తర్వాత బీసీ కులగణన తర్వాత స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈలోపే రాష్ట్ర, జిల్లా పార్టీ కమిటీలను కూడా ఏర్పాటు చేయనున్నారు. వీరితో పాటు మండల స్థాయిలో కూడా కమిటీల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులు పూర్తి కావడంతో ఎక్కువ మంది నేతలు ఈ పదవులపై దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. గ్రామాలు, మండలాల్లో తిరుగుతూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఎలాగైనా పార్టీ తరఫున పోటీ చేసి పదవులకు వచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం కులగణన తర్వాత ఈ ఎన్నికలు నిర్వహించనుండటంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటి నుంచి ఆయా గ్రామాల పరిధిలో పనులు చేసి పెడుతున్నారు. వచ్చే ఫిబ్రవరిలో మున్సిపల్ సభ్యుల పదవీకాలం కూడా ముగిసి పోతుంది. ఆ పదవి కూడా ఖాళీ కానున్నాయి. రిజర్వేషన్‌కు అనుకూలంగా ప్రధానమైన పదవులు ఉంటే పోటీ చేసేందుకు సీనియర్ నేతలు సన్నద్ధమవుతున్నారు. మున్సిపల్ ఛైర్మన్లతో పాటు మండల స్థాయిలో మండల అధ్యక్షులుగా, జడ్పీఛైర్మన్ పదవులపై దృష్టిపెట్టి పనిచేస్తు న్నారు. తమకు పనులు అయ్యేందుకు ప్రస్తుతం ఏదోక పదవిని ఇవ్వాలని నేతలను కోరుతున్నారు. ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నేతలను కలుస్తూ విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

● వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ

ఖిల్లా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతు సోదరులు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ అన్నారు. గురువారం ఆమె ఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకొని ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రైతు పండుగలో భాగంగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ పథకాల గురించి ఈ స్టాల్స్‌లో వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాకు చెందిన రైతులు మహబూబ్‌నగర్‌లో జరిగే రైతులందరూ తరలివెళ్లాలని అక్కడ ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల స్టాల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డికి ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి మాట్లాడుతూ.. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పుస్తకాలు అందించడం జరుగుతుందని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఆల్ఫోర్స్ సంస్థ పుస్తకాలు అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన డీసీసీబీ ఛైర్మన్



వ్యవసాయ మంత్రికి పూల మొక్కను అందజేస్తున్న డీసీసీబీ ఛైర్మన్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ కుంట రమేష్‌రెడ్డి గురువారం మహబూబ్‌నగర్‌లో కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు పండుగ నిర్వహిస్తుండటంతో దానికి సహకార బ్యాంకుల తరపున హాజరయ్యారు. ఇది రైతులకు ఎంతో విధంగా మేలు చేపడుతుందని ఆయన తెలిపారు. జిల్లా నుంచి కూడా సహకార సంఘాల సభ్యులతో పాటు రైతులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

చెవిలో పూలు పెట్టుకొని నిరసన



చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం నగరంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ గురుకులాలు, కెజిబివిలలో నాసిరకం భోజనాలతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దినేష్, చక్రి, ఆజాద్, సుశాంత్, అనిల్, సాయికృష్ణ, పాల్గొన్నారు.

మండలంలో అదనపు కలెక్టర్ తనిఖీలు

సిరికొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొదట కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో అదనపు కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. భోజనశాల బియ్యం, కూరగాయలు, పప్పులు ఇతర వంట సామగ్రిని పరిశీలించారు. మెరుగైన కూరగాయలు తెప్పించాలని ప్రత్యేక అధికారికి సూచించారు. సిరికొండలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల ఆటవస్తువులను పరిశీలించారు. మాడల్ స్కూల్‌లో గల బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీవో తారచంద్ ఉన్నారు.

కొండాపూర్‌లో పశువైద్య శిబిరం

సిరికొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామంలో గురువారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువులకు వైద్యాధికారులు, సిబ్బంది టీకాలు వేశారు. పశువైద్యాధికారి బాబురావు ఆధ్వర్యంలో సిబ్బంది చికిత్స అందించారు. శిబిరంలో 50 గేదెలు, 8 ఆవులకు చికిత్స చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ కృష్ణ, వెటర్నరీ సహాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, గోపాలమిత్ర రంజిత్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో జ్యోతిబా పూలేకు ఘన నివాళులు

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జ్యోతిబా పూలేకు ఘన నివాళులర్పించారు. గురువారం జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబా పూలే గొప్ప సంఘసంస్కర్త అని కొనియాడారు. నిరంతరం విద్యను అందరికి అందించాలని తపనతో ఉన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. అంటరానితనాన్ని రూపుమాపడానికి కృషి చేశాడని అన్నారు. యువత ఆయన మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శంకర్, శేఖర్, హన్మాగౌడ్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో..

మహాత్మ జ్యోతిబా పూలే వర్ధంతిని భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య మాట్లాడుతూ.. భారతదేశంలో విద్య వ్యాప్తిపై నిరంతరం కృషి చేశారని అన్నారు. స్త్రీలకు విద్యను అవసరం అని తెలియజేసిన వ్యక్తి జ్యోతిబా పూలే అని అన్నారు. సత్యశోధక్ సంస్థను స్థాపించి విద్యను అందరికి పరిచయం చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మాదాలే అజయ్, జిల్లా సమన్వయకర్త సీహెచ్ వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సక్కి ప్రభాకర్, బిలిందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.




జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

సిరికొండ: సమాజంలో పేరుకు పోయిన సామాజిక రుగ్మతులను తొలగించి అసమానతలు లేని సమాజం కోసం కృషి చేసిన గొప్ప మహనీయుడు మహాత్మాజ్యోతిబా పూలే అని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. సిరికొండలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య, స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు కేటాయించాలి

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్త కలెక్టరేట్ పక్కన నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను పేదలకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పక్కనగల డబుల్ బెడ్‌రూంలను గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని చాలా కాలంగా పేదలు ప్రభుత్వానికి, అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నా పంపిణీ చేయకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా మారాయన్నారు. నాగారం ప్రాంతంలోని 396 ఇండ్లు పూర్తయి నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ పేదలకు పంచడం లేదన్నారు. కలెక్టరేట్ వద్ద ఉన్న 252 ఇండ్లను 60 శాతం పైగా పూర్తయ్యాయని కొద్దిపాటి నిధులు కేటాయిస్తే వీటిని కూడా పంపిణీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వ నిర్లక్ష్యంతో డబుల్ బెడ్‌రూంలో ఉన్న కిటికీలు, అద్దాలు, తలుపులు, కరెంటు వైర్లు దొంగిలించడం జరిగిందన్నారు. నిఘా లేకపోవడంతో ప్రజలకు ఉపయోగపడకుండా మారాయన్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి అర్హులైన పేదలకు డబుల్‌బెడ్‌రూం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజలు వాటిని నివాస ప్రాంతాలుగా మార్చుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్, విఘ్నేష్, నగర నాయకులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



విజయ డెయిరీ పాలను ప్రచారం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పిల్లల ఆరోగ్యానికి విజయ పాలు శ్రేష్ఠం

మోపాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్య అభివృద్ధికి స్వచ్ఛమైన పాలు విజయ డెయిరీ పాలేనని విజయ టోన్డ్ మిల్క్ సంస్థ ప్రతినిధులు ప్రచారం నిర్వహించారు. గురువారం నిజామాబాద్ నగరంలో విజయ డెయిరీ పాల సంస్థ అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. అన్ని పాలకంటే విజయ పాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమైనవని తెలిపారు. పిల్లల ఆరోగ్యం బాగుండాలంటే ఈ పాలను తాగించాలని అన్నారు. తెలంగాణ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో విజయ పాల డెయిరీ నడుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పాలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ లిమిటెడ్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లుల మంజూరు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి గాను మధ్యాహ్న భోజన పెండింగ్ మరియు రెగ్యూలర్ బిల్లుల కోసం నిధులు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఎగ్ బడ్జెట్ 76లక్షల 87వేల 401 రూపాయి మంజూరు అయ్యాయని మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఐఎఫ్ఎంఐఎస్ ద్వారా బిల్లులు విడుదల చేయుటకు ఆదేశాలు ఇచ్చామని ఆయన తెలిపారు. రెండు మూడు రోజుల్లో బిల్లులు ఏజెన్సీల ఖాతాల్లో జమవుతాయని ఆయన తెలిపారు.

ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి బదిలీ

● నూతన ఆర్ఎంగా జ్యోత్స్న

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం సంస్థ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జాన్‌రెడ్డి స్థానంలో మెదక్ డీఎంగా పనిచేస్తున్న జ్యోత్స్నను నిజామాబాద్ ఆర్ఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ ఆర్ఎంగా పనిచేసిన జానిరెడ్డిని నల్గొండకు బదిలీ చేశారు. జానిరెడ్డి సుమారు సంవత్సరంన్నర కాలంగా నిజామాబాద్ ఆర్ఎంగా పనిచేశారు. శుక్రవారం నూతన ఆర్ఎంగా జ్యోత్స్న బాధ్యతలు స్వీకరించనున్నారు.



సిర్పూర్ గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మోపాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నారని డిసెంబర్ 2న నిజామాబాద్‌లో నిర్వహించే ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఏఐకెఎంఎస్ నారాయణ, ఎర్రన్నలు విమర్శించారు. గురువారం ప్రచారంలో భాగంగా మోపాల్ మండలం సిర్పూర్ గ్రామంలో ర్యాలీగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలేని వ్యవసాయ కూలీలకు నెలకు 1000 రూపాయలు, సంవత్సరానికి 12వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకపోవడంపై వారు మండిపడ్డారు. అర్హులైన వారందరికి 4వేల జీవనభృతి ఇస్తామని ఇవ్వలేకపోతున్నారని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన వారందరికి ప్రతీనెలా 4వేలు పెన్షన్ ఇస్తామని ఇప్పటి వరకు అమలు చేయలేకపోతున్నారని అన్నారు. ఈ సమస్యలన్నింటిపై డిసెంబర్ 2న ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, స్వరూప, రుక్మిణి, సాయిలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జక్రాన్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలని ఎస్సై సీహెచ్.తిరుపతి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో గంజాయి, మత్తు పదార్థాలు, సబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పిస్తూ వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్‌నేరాలు, విద్యార్థినిలకు ఈవ్‌టీజింగ్, సైబర్‌భద్రత, షీటీం యొక్క ఆవశ్యకత, యువత చెడు వ్యాసనల వల్ల జరిగే దుష్ఫలితాల గురించి, రోడ్డుభద్రత నియామలను పాటించాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు బి.దేవరాం, మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

ఇందల్వాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిర్మాన్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి దొంగలు ఐదు తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. తిర్మాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇమ్మడి సాయవ్వ గురువారం రాత్రి ఇంటి తలుపులు పెట్టి దగ్గరలోని ఓ కిరాణా షాపుకు వెళ్లింది. నిత్యావసర సరుకులు కొనుక్కొని తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపు తెరిచి ఉన్నాయి. దీంతో బీరువాలో ఉన్న బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఆడిట్ సెల్ డైరెక్టర్

డిచ్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని సీబీసీఎస్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, కోర్సులకు 1,3,5వ సెమిస్టర్ రెగ్యులర్, 2,4,6 వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్ష కేంద్రాల్లో 7991 మంది విద్యార్థులకు గాను 7480 మంది పరీక్షలకు హాజరయ్యరని, 511మంది విద్యార్థులు గైర్హాజరయ్యరని, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 6561 మంది విద్యార్థులకు 6030 మంది హాజరయ్యారని, 531 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు. గిరిరాజ్ కళాశాల, వాగ్దేవి, సీఎస్ఐ, ఉమెన్స్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తనిఖీలు చేశారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఘంటా చంద్రశేఖర్



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

సీఎం దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విద్యార్థుల మృతికి నిరసనగా నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తాలో గురువారం ఎబివిపి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందూరు విభాగ్ కన్వీనర్ శశి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఏ విధంగా ఆడుకుందో ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా పనిచేస్తుందన్నారు. వసతిగృహాలలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మధ్యాహ్న భోజనం ఫుడ్ పాయిజన్ కావడం వల్ల అస్వస్థతకు గురవుతున్నారని అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. విద్యాశాఖ మంత్రి కూడా లేని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, మహేష్, రాము, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీల పరిశీలకుడిగా స్వామికుమార్

సుభాష్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల హాకీ పోటీలకు జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ స్వామికుమార్ పరిశీలకుడిగా ఎంపికయ్యారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు స్వామికుమార్ పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. స్వామికుమార్ వర్నిమండలం జాకోరా జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు పరిశీలకుడిగా వ్యవహరించడం పట్ల ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, సీనియర్ హాకీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ధర్పల్లికి మంత్రి కోమటిరెడ్డి రాక

ధర్పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగే ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొననున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, జిల్లా అధికార ప్రతినిధి చెలిమెల నర్సయ్యలు తెలిపారు. ఉదయం 11గంటలకు మండల కేంద్రంలోగల తెలంగాణ తల్లి విగ్రహం నుంచి దమ్మన్నపేట్ గ్రామానికి గల 5 కిలోమీటర్ల రోడ్డు వెడల్పుతో పాటు 12గంటలకు గ్రామంలోగల గురడిరెడ్డి కల్యాణ మండపంలో జరిగే ప్రజాపాలన విజయోత్సవాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరవుతున్నట్లు వారు చెప్పారు. రోడ్డు వెడల్పుకు గాను ఆర్అండ్‌బి నుంచి రూ.8కోట్లు మంజూరు అయ్యాయని దీనికి సంబంధించి మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జెండా బాలాజీ మందిర్ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జెండా గల్లీలోగల జెండా బాలాజీ మందిర్ ఆలయ హుండీని గురువారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయానికి 63వేల 600 రూపాయలు ఆదాయం సమకూరింది. ఆదాయంలో 58వేల 320 రూపాయలు నోట్ల రూపంలో రాగా, 5280 రూపాయలు నాణెల రూపంలో సమకూరింది. హుండీ లెక్కింపులో ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేణు, అర్చకులు నాగరాజాచార్య, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, మురళి, విష్ణుసహస్ర నామ పారాయణ భక్తులు పాల్గొన్నారు.

గోల్ హనుమాన్ ఆలయంలో..

స్థానిక జెండా గల్లీలోగల గోల్‌హనుమాన్ దేవాలయం హుండీని లెక్కించారు. ఆలయానికి 41వేల 120 రూపాయలు ఆదాయం సమకూరింది. ఆదాయంలో 34వేల 510 రూపాయలు నోట్ల రూపంలో రాగా, 6వేల 610 రూపాయలు నాణెల రూపంలో వచ్చింది. ఆలయ అర్చకులు జైరాజ్ జోషి, జూనియర్ అసిస్టెంట్ అంజనేయులు, గంగారెడ్డి, తదితర భక్తులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.190	రూ.270	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	: రూ.200	రూ.280	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78900	రూ.72800	రూ.925

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అమరన్ (12.00, 3.30, 7.00, 10.30)
స్క్రీన్-2 : మోనా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00, 1.25, 6.45, 9.10)
: కేశవచంద్ర రమావత్ (3.50)
స్క్రీన్-3 : ర్యూన్సీ ఐపిఎస్ (10.25)
: ఫస్ట్ కేస్ ఆఫ్ ఉద్వేగం (1.45)
: భైరతీ రనాగల్ (4.30)
: లక్కీ భాస్కర్ (7.25)
: జీబ్రా (10.40)
స్క్రీన్-4 : కేశవచంద్ర రమావత్ (10.05)
: రోటీ కపడ రొమాన్స్ (1.00, 7.15)
: ఉక్కు సత్యాగ్రహం (4.15)
: భైరతీ రనాగల్ (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అమరన్ (10.25)
: భైరతీ రనాగల్ (1.30, 7.35)
: రోటి కపడ రొమాన్స్ (4.30, 10.30)
స్క్రీన్-3 : మోనా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00, 7.35)
: అమరన్ (1.25, 10.30)
: ది సబర్మతి రిపోర్ట్ (4.30)

దేవి: జీబ్రా (11.15, 6.15)
: మెకానిక్ రాకీ (2.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రోటీ కపడ రొమాన్స్ (11.15, 2.15,6.15, 9.15)
లలితామహల్: భైరతీ రనాగల్ (11.15, 2.15, 6.15, 9.15)

– నిజామాబాద్ అర్బన్